ఆంధ్రప్రభ Estd. 1938 Journalism first!

తూర్పు గోదావరి
EAST GODAVARI

ఆదివారం 18, ఆగస్టు 2019



# దేశాభివృద్ధికి సాంకేతిక విద్య దోహదం

- జెఎన్‌టియు స్నాతకోత్సవలంలో గవర్నర్ హరిచందన్

(కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి) :

ఆర్థికాభివృద్ధికి సాంకేతిక విద్య ఎంతో దోహద పడుతుందని, దేశాభివృద్ధికి దీని పాత్ర యంతైనా ఉందని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ వెల్లడించారు. శనివారం జె.ఎన్.టి.యు.లో నిర్వహించిన 7వ స్నాతకోత్సవంలో గవర్నర్ మరియు జె.ఎన్.టి.యు. ఛాన్సిలర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అధ్యాపకవర్గం, గోల్డ్ మెడల్ , డాక్టరేట్ పట్టాలు పొందిన వారిని ఉద్దేశించి మాట్లాడారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్శిటీ (జె.ఎన్.టి.యు.)లో ఉన్నత విద్యను అభ్యసించి పట్టాలు పొందిన వారు భావి తరాలకు ఆదర్శవంతంగా నిలవాలని గవర్నర్ ఆకాంక్షించారు. జె.ఎన్.టి.యు.లో విద్యను అభ్యసించిన వారు జాతీయ, అంతర్జాతీయ

- మిగతా 2లో..



# దేశాభివృద్ధికి సాంకేతిక విద్య దోహదం

స్థాయిలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం గర్వించదగ్గ విషయమ న్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు ఉన్నత ఆశయాలతో ఈ సంస్థ ముందుకు తీసుకు వెళ్ళడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చక్కటి క్రమశిక్షణ, భక్తి భావం సంస్థ పని తీరుకు నిదర్శనమన్నారు. సాంకేతిక విద్య మానవ వనరుల ను అభివృద్ధి చేసుకోవడంతో పాటు, నైపుణ్యం, పారిశ్రామిక వృద్ధికి తోహదపడుతున్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం మేక్ఇన్ఇండియా , స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా , డిజిటల్ ఇండియా లాంటి కార్యక్రమాలు చేపట్టి యువతను ప్రోత్సహించి, ప్రపంచంలో మన దేశం మొదటి స్థానంలో నిలిచే విధంగా ముందుకు వెళుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం ద్వారా యువత తాము కోరుకుంటున్న విధంగా సహకారం అందిస్తుందన్నారు. మేక్ఇన్ఇండియా ద్వారా నైపుణ్య సామర్థ్యాలను వెలికి తీసి యువతలో ఉన్న నైపుణ్యాన్ని అభివృద్ధి చేసే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించి, రాష్ట్ర వృద్ధి రేటు పెరిగే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జె.ఎన్.టి.యు. 7వ స్నాతకోత్సవంలో బంగారు పతకాలు, డాక్టరేట్లు పొందిన వారికి ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ విశ్వ భూషణ్ హరిచందన్ ప్రత్యేకంగా అభినందించారు.

వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ రామలింగరాజు మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు అయినప్పటి నుండి దశల వారీగా జె.యన్.టి.యు. ఎంతో సాంకేతిక నైపుణ్యత సాధించి, అంతర్జాతీయ ఖ్యాతి చెందిందన్నారు. ఈ సందర్భంగా వైస్‌ఛాన్సిలర్ జె.యన్.టి.యు. నాటి నుండి నేటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. జే.ఎన్.టి.యు. రిజిస్ట్రార్ సుబ్బారావు మాట్లాడుతూ ఈ కళాశాల నేటి అవసరాలకు అనుగుణమైన సాంకేతికపరమైన విద్యా విధానాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బి.హెచ్.ఇ.ఎల్. మాజీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బొంత ప్రసాదరావుకు జె.యన్.టి.యు. కళాశాల తరుపున గవర్నర్ గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు. అదే విధంగా జె.యన్.టి.యు.



అనుబంధ సంస్థల్లో చదువుతున్న, అధ్యాపక వృత్తిలో ఉండి డాక్టరేట్ పొందిన వారికి గోల్డ్ మెడల్స్, డాక్టరేట్ పట్టాలు గవర్నర్ చేతులు మీదుగా అందించారు. గౌరవ డాక్టరేట్ గ్రహీత బొంత ప్రసాద్ రావు మాట్లాడుతూ శక్తి సామర్థ్యం ఉన్న ప్రతి ఒక్కరూ అకుంటిత దీక్షతో అపజయాలను వదిలి, ముందు చూపుతో ముందుకు వెళితే లక్ష్యాలు సాధించవచ్చునని తెలిపారు.

తొలుతగా గవర్నర్ గన్నవరం విమానాశ్రయం నుండి హెలికాప్టర్ ద్వారా కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ కు ఉ.9.45 నిమిషాలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద గవర్నర్ కు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ , కాకినాడ పార్లమెంటు సభ్యులు వంగా గీత, అమలాపురం పార్లమెంటు సభ్యులు చింతా అనురాధ, శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి , మేయర్ సుంకర పావని, కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి, ఎస్.పి. అద్నాన్ నయీం అస్మి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ పెరేడ్ గ్రౌండ్ నుండి బయలుదేరి జెఎన్.టి.యు. అతిథి గృహానికి చేరుకుని, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జె.యన్.టి.యు. ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని జె.యన్.టి.యు. అలుమిని ఆడిటోరియంకు చేరుకున్నారు.